సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 7 । మార్చి । 2024



శివ శివ శంకర..

అఖండ గోదావరి మధ్య ఉన్న పట్టిసం శివక్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. కాలినడకన చేరుకునేలా నదిపై పంట్లు ఏర్పాటు చేశారు. 8లో ▸



ఆకట్టుకున్న 'రాత' నాటిక

పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటక పోటీల్లో వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ ప్రదర్శించిన రాత నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. 8లో ▸




వైభవంగా ధ్వజారోహణ

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుని ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆమెదే అగ్రాసనం

భారతదేశంలో మహిళలది ప్రత్యేక స్థానం. ప్రతి ఇంట్లో అమ్మగా, అక్కగా, చెల్లిగా, భార్యగా, సమాజంలో ఉద్యోగిగా, వ్యాపారవేత్తగా, రాజకీయ నేతగా నేడు మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. మహిళలకు రాజకీయంగా కూడా తగిన ప్రాధాన్యత కల్పించడంతో పాటు సంక్షేమ పథకాల లబ్ధి కల్పిస్తూ మహిళ సాధికారత సాధన దిశగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలన సాగించారు. సర్పంచ్ నుంచి మంత్రి వరకు పాలనలో వారికి పెద్దపీట వేసి గౌరవించారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- మహిళా సాధికారత అమలు దిశగా జగన్ పాలన
- మహిళా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- రాజకీయ, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ప్రోత్సాహం
- సంక్షేమ పథకాల అమలులో అతివలకు ప్రాధాన్యం
- సర్పంచ్ నుంచి మంత్రి వరకు రాజకీయ ప్రాతినిధ్యం
- 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



భీమవరం (ప్రకాశం చౌక్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో మహిళా సాధికారత సమర్థవంతంగా అమలవుతోంది. ప్రభుత్వ పథకాల లబ్ధిని 90శాతం మహిళలకే అందేలా చర్యలు తీసుకున్నారు. స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించడమే కాక ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందజేశారు. అమ్మ ఒడి, ఆసరా, కాపు నేస్తం తదితర పథకాలు వర్తించేలా చేసి వారిని సమాజంలో గౌరవప్రదంగా నిలబెట్టారు. నేరుగా మహిళల బ్యాంక్ ఖాతాలకే లబ్ధి జమ చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చేయూత నివ్వడంతో వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకుంటున్నారు.

రాజకీయంగా ముందడుగు

సీఎం వైఎస్ జగన్ మహిళలను రాజకీయంగా ఎదిగేందుకు ఏంతో ప్రోత్సహించారు. సర్పంచ్ పదవి నుంచి ఉప ముఖ్యమంత్రి పదవి వరకు మహిళలకు ప్రాధాన్యం ఇచ్చి మహిళ పక్షపాతిగా నిలిచారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి తానేటి వనిత హోం శాఖ మంత్రిగా ఉండగా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఘంటా పద్మశ్రీ,, వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జిగా గూడూరి ఉమబాల, అలాగే ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కార్పొరేషన్ చైర్‌పర్సన్లు, డైరెక్టర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లుగా అనేక మంది మహిళలు రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేశారు.

మహిళలకు రక్షణగా మహిళా పోలీసు

మహిళలకు కష్టం, అపద వస్తే అండగా నిలబడటానికి ప్రభుత్వం ఓ మహిళా పోలీసును రక్షకురాలుగా నియమించింది. ప్రతి వార్డు/గ్రామ సచివాలయానికి మహిళ పోలీసు పేరిట ఉద్యోగం ఇచ్చి తోడుగా నిలిచేలా చేసింది. దిశ లాంటి యాప్‌లను తీసుకువచ్చి మహిళల సత్వర రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చింది.

సచివాలయాల్లో మహిళ ఉద్యోగులదే అగ్రభాగం

ప్రజల ముగింటకే సంక్షేమం, అభివృద్ధి అందించడానికి సీఎం వైఎస్ జగన్ తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులలో మహిళలే ఎక్కువ. లక్షలాది ఉద్యోగాల భర్తీలో మహిళలకే ప్రాధాన్యం ఇచ్చారు.

ఉన్నతాధికారిణులుగా విలువైన సేవలు

జిల్లాలోని ఉన్నతాధికారులుగా పలువురు మహిళలు కొలువు తీరి ప్రజలకు సేవలందిస్తున్నారు. పోలీసు శాఖలో జిల్లా సూపరింటెండెంట్‌గా అజిత వెజెండ్ల మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన కలెక్టర్ ప్రశాంతి కూడా జిల్లా ప్రజలకు విలువైన సేవలు అందించారు. కొన్ని నెలల పాటు జిల్లా పరిపాలన ఇద్దరు మహిళల ఆధ్వర్యంలో నడిచింది.

నూరు శాతం సాధికారత



మహిళ సాధికారత అనే మాట గతంలో వినడం తప్ప సాధించింది లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో మహిళ సాధికారత నూటికి నూరుశాతం అమలవుతోంది. మహిళలు సంక్షేమ పరంగా, రాజకీయంగా చైతన్యవంతులయ్యారు. రాజకీయ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం గొప్ప విషయం. ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది.

– తానేటి వనిత, రాష్ట్ర హోం శాఖ మంత్రి

ఇంకా చైతన్యం రావాలి



మహిళలు రాజకీయంగా ఇంకా చైతన్యవంతులు కావాలి. గృహిణిగా పరిమితం కాక సమాజంలో అన్ని రంగాల్లో ఆమె పాత్ర ఉండాలి. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో సంక్షేమంతోపాటు రాజకీయంగా మహిళలకు పురుషులతో పాటు సమాన అవకాశాలు కల్పిస్తున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి నాకు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– ఘంటా పద్మశ్రీ, చైర్‌పర్సన్, ఉమ్మడి జిల్లా పరిషత్

సేవ చేయాలనే లక్ష్యంతో..



ప్రజలకు సేవ చేయాలని లక్ష్యంతో రాజకీయల్లో ఉన్న సాధారణ మహిళల ఆకాంక్షలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేరుస్తున్నారు. బీసీ వర్గానికి చెందిన సాధారణ మహిళగా రాజకీయాల్లో ఉన్న నన్ను పార్లమెంట్‌కు పంపించాలని సీఎం తీసుకున్న నిర్ణయం మహిళా సాధికారతకు నిదర్శనం. ఈ అవకాశం నాకు కల్పించడం మహిళందరికి ఆయన ఇచ్చిన గౌరవం.

– గూడూరి ఉమాబాల, వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి

ధైర్యంగా ముందడుగు వేయాలి



మహిళలు ధైర్యంగా ముందడుగు వేసి ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించాలి. మహిళలు మానసికంగా, ఆరోగ్యంగా పటిష్టంగా ఉండాలి. అప్పుడే అటు కుటుంబానికి, ఇటు సమాజానికి కూడా తన వంతు మేలు చేయగలుగుతుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అపదలో ఉన్నవారికి, అన్యాయం జరిగిన మహిళలకు కమిషన్ ద్వారా అండగా నిలుస్తున్నారు.

– బూసి వినీత, మహిళా కమిషన్ సభ్యురాలు

మహిళలకు అమలు చేసిన ప్రభుత్వ పథకాల వివరాలు

పథకం	లబ్ధిదారుల సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	26,46,525	597.62
చేయూత	1,05,779	234.71
ఆసరా	2,56,316	1067.00
కాపు నేస్తం	2,24,286	79.40
ఈబీసీ నేస్తం	12,286	19.02
కల్యాణమస్తు	1,55,821	13.79

పేద మహిళలకు ఆర్థిక చేయూత



పేద మహిళలకు ఆర్థిక చేయూతగా అనేక సంక్షేమ పథకాలు అందించి అదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. మహిళలకు ప్రత్యేకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. మహిళలకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించడంతో వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. మహిళలు కోరుకున్న విధంగా సీఎం వైఎస్ జగన్ పథకాలు అమలు చేసి ఆదుకుంటున్నారు.

– బి.వెంకటలక్ష్మి, లబ్ధిదారు

న్యూస్‌రీల్

26 నుంచి సుదర్శన నరసింహ మహాయజ్ఞం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: విశాఖ జిల్లా సింహాచలం శ్రీ వారాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో ఈనెల 26 నుంచి ఏప్రిల్ 1 వరకు శ్రీసుదర్శన నారసింహ మహాయజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మహాయజ్ఞం పోస్టర్లను, ఆహ్వాన పత్రికలను ఆయన ఆవిష్కరించారు. వారం పాటు మహాయజ్ఞం జరిగే నిర్వహణ వివరాలను దేవదాయ శాఖ కమిషనర్ ఆర్.సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి మంత్రి కొట్టుకు వివరించారు. దేవస్థానం నుంచి వచ్చిన వేద పండితులు, అర్చకులు మంత్రి కొట్టు సత్యనారాయణ, సౌదామిని దంపతులకు వేదాశీర్వాదం అందజేశారు.

మండలి చైర్మన్‌ను కలిసిన డీఎస్పీ



మోషేన్‌రాజును కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

భీమవరం: భీమవరం డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వి.నారాయణస్వామి రెడ్డి బుధవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో మోషేన్‌రాజును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను ఉన్నారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎం.వి జయరాజు బుధవారం పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ముఖ్యంగా క్యూలైన్ల వద్ద తాగునీరు ఏర్పాట్లు చేయాలన్నారు. అంతర్వేది దేవస్థానం సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, జిల్లా అధికారి ఈవీ సుబ్బారావు, భీమవరం డివిజన్ అధికారి వి.వెంకటేశ్వరరావు, ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ ఆయన వెంట ఉన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

భీమవరం (ప్రకాశం చౌక్): సెక్టార్ అధికారులు ఎన్నికల విధులను అప్రమత్తతతో నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల సెక్టార్ అధికారులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల పట్ల అప్రమత్తతో పనిచేయాలన్నారు. సెక్టార్ పరిధిలో ఏదైనా సమస్య ఉంటే వెంటనే రిటరిన్గ్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సెక్టార్ అధికారికి పోలింగ్‌కు వారం రోజులు ముందు మెజిస్ట్రేట్ పవర్స్ ఇస్తారన్నారు. పోలింగ్ రోజు గొడవలకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశాలు, ఎంసీసీ ఉల్లంఘనకు చర్యలు, తదితర నిర్ణయాలను అమలు చేయవచ్చన్నారు. జిల్లాలో మొత్తం 1,461 పోలింగ్ స్టేషన్ లు ఉన్నాయని 140 మంది చొప్పున సెక్టార్ అధికారులను నియమించామన్నారు. ఒక్కో సెక్టార్ అధికారికి సుమారు 10 నుండి 12 పోలింగ్ స్టేషన్ల విధులను కేటాయించామన్నారు. క్యూలైన్లతో నిమిత్తం లేకుండా గర్భిణులు, బాలింతలు, వయావృద్ధులు, వికలాంగులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ఇంటర్ పరీక్షకు 779 మంది గైర్హాజరు

భీమవరం: జిల్లాలో బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షకు 779 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐఓ కె.చంద్రశేఖర్ బాబు చెప్పారు. జిల్లాలోని 50 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, జనరల్ విద్యార్థులు 17,473 మందికి 16,906 మంది హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు 1,930 మందికి 1,718 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

బీసీలపై చంద్రబాబుది కపట ప్రేమ

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలపై కపటప్రేమ చూపేందుకు తెరతీసిన జిత్తులమారి చంద్రబాబు మాటలు నమ్మేందుకు బీసీ వర్గాలు సిద్ధంగా లేవని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహిస్తున్న ప్రజాదీవెన యాత్రలో మంత్రి కారుమూరి మాట్లాడారు. బీసీల తోక కత్తిరిస్తానంటూ కన్నెర్ర చేసిన చంద్రబాబును బీసీలు నమ్మరన్నారు. చంద్రబాబు బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తే.. సీఎం జగన్ బీసీలను సమాజానికి బ్యాక్ బోన్‌గా చూశారని గుర్తుచేశారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాజ్యసభ సీట్లను అమ్ముకున్నారే తప్ప ఒక్క బీసీని రాజ్యసభకు పంపలేదని విమర్శించారు. సీఎం జగన్ నలుగురు బీసీ నేతలను రాజ్యసభకు పంపించి సామాజిక న్యాయం చేశారని కొనియాడారు. జగన్ పాలనలో బీసీ వర్గాల బ్యాంకు ఖాతాలకు రూ.1.75 లక్షల కోట్లను నేరుగా జమచేశారన్నారు. బీసీల్లోని 136 కులాలను గుర్తించి 56 కార్పొరేషన్‌న్లు ఏర్పాటుచేశారని, ఒక్క బీసీగా ఈ విషయాన్ని కాలర్ ఎగరేసి చెబుతున్నానని స్పష్టం చేశారు. బీసీ వర్గాలు వారి కులవృత్తుల్లోనే మగ్గిపోవాలనేది చంద్రబాబు సిద్ధాంతమని, బీసీ కులాల్లో పుట్టిన పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుంటే వారికి ఇంగ్లిష్ మీడియం వద్దని న్యాయస్థానాలను ఆశ్రయించిన చంద్రబాబును బీసీలు దుమ్మెత్తిపోస్తున్నారనే విషయాన్ని గ్రహించాలన్నారు. పెత్తందారీ మనస్తత్వంతో బీసీలను చంద్రబాబు అణగదొక్కుతున్నాడని విమర్శించారు. ఎన్నికల ముందు జయహో బీసీ అనే చంద్రబాబు ఎన్నికల తర్వాత బీసీ నినాదాన్ని తుంగలో తొక్కేస్తారని దుయ్యబట్టారు. తాను బీసీని కాబట్టే జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, ఇప్పుడు మంత్రిగా ఎదిగానని, బీసీగా నన్ను గుండెల్లో పెట్టుకున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటానని అన్నారు.

బీసీలకు పెద్దపీట వేసింది సీఎం జగనే

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



సాక్షి, భీమవరం: రాష్ట్రంలో బీసీలకు సామాజిక న్యాయం చేసి, రాజ్యాధికారం ఇచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. చంద్రబాబు బీసీ డిక్లరేషన్ అంతా ఎన్నికల బూటకమేనని, 14 ఏళ్ల పాలనలో ఆయన బీసీలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీలు జడ్జిలుగా పనికిరారంటూ 2017లో కేంద్రానికి లేఖ రాసిన చంద్రబాబు ఎన్నికలు వస్తుండటంతో జయహో బీసీ అంటూ బీసీ జపం చేస్తున్నారని విమర్శించారు. బీసీ డిక్లరేషన్ పేరిట ఆయన ఇచ్చిన వాగ్దానాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

బ్యాక్ బోన్‌గా.. బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు.. బ్యాక్ బోన్ క్యాస్ట్ అని సీఎం జగన్ అన్నింటా బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చారన్నారు. ఐదేళ్లలో సీఎం జగన్ నలుగురు బీసీ నాయకులను రాజ్యసభకు పంపిస్తే 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ఒక్కరిని పంపలేదన్నారు. జగన్ కేబినేట్‌లో 11 మందికి మంత్రి పదవులిస్తే చంద్రబాబు కేవలం 8 మందికి మాత్రమే అవకాశం ఇచ్చారన్నారు. శాసనమండలిలో 29 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులకు ఎమ్మెల్సీలుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవకాశం కల్పిస్తే గత టీడీపీ ప్రభుత్వం కేవలం 18 మందికి మాత్రమే ఎమ్మెల్సీలను చేసిందని విమర్శించారు. 13 జెడ్పీ చైర్మన్లకు గాను ఆరు, 84 మున్సిపల్ చైర్మన్లకు గాను 44, అలాగే 14 కార్పొరేషన్లకు గాను 9 మేయర్ పదవులను బీసీలకు ఇవ్వడం ద్వారా పాలనలో బీసీలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలోనే బీసీలకు నిజమైన మేలు జరిగిందని, ఈ విషయంలో తాను బహిరంగ చర్చకు సిద్ధమని కవురు సవాల్ చేశారు.

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ



చెక్కు అందిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తోందని జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నమూనా చెక్కును అందచేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో మిచాంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన 31,678 మంది రైతులకు రూ.26.22 కోట్లు, ఉద్యాన పంటలు నష్టపోయిన 876 మంది రైతులకు రూ.50.60 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైందన్నారు. ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏ సీజన్లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పెట్టుబడి రాయితీ విడుదల చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, జేడీఏ జెడ్.వెంకటేశ్వరరావు, ఉద్యాన అధికారి సీహెచ్ శ్రీనివాసులు, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కొట్టి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కలిదిండి: విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎస్‌డీవీ ప్రసాద్ బుధవారం తెలిపారు. మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన కుందేటి నాగరాజు(38) భార్య శాంత కుమారితో కలిసి తాడినాడ పంచాయతీ పరిధిలో హైస్కూల్ దగ్గర రొయ్యల చెరువును లీజుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. బుధవారం ఉదయం చెరువులో రొయ్య పిల్లలను మార్చి చెరువు చుట్టూ తిరిగి వచ్చేటప్పుడు విద్యుత్ తీగలు కింద ఉండడం గమనించాడు. వాటిని తీసి కర్రకు కడుతుండగా విద్యుత్ షాక్‌నకు గురై కింద పడిపోయాడు. వెంటనే భార్య తాడినాడులో ఆర్ఎంపీ వైద్యునికి చూపించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భార్య శాంతకుమారి ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కై కలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చాట్రాయి: మండలంలోని సూరంపాలెంలో మెయిన్ రోడ్డులో ఓ యువకుడు ద్విచక్ర వాహనంతో కల్వర్టును ఢీకొట్టి మృతి చెందాడు. ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం ఎన్‌టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం నర్సాపురం గ్రామానికి చెందిన కంచర్ల మణికంఠ(29) మంగళవారం రాత్రి సత్తుపల్లి నుంచి తన ద్విచక్రవాహనంపై నర్సాపురం వస్తున్నాడు. ఈ క్రమంలో సూరంపాలెం మెయిన్ రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును బైక్ అదుపుతప్పడంతో ఢీకొట్టాడు. వెంటనే స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు తమ వాహనంలో విస్సన్నపేట తరలిస్తుండగా మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

ఎన్నార్పీ అగ్రహారంలో తేనెటీగల పెంపకంపై శిక్షణ

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న తేనెటీగల పెంపకంపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో ఆసక్తి ఉన్న యువత పాల్గొనాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లిఖార్జున రావు బుధవారం విలేకరులకు తెలిపారు. తేనెటీగల పెంపకం మంచి లాభదాయకమని ఔత్సాహిక రైతులు, యువత దీనిపై దృష్టి సారిస్తే మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉందన్నారు. స్వచ్ఛమైన తేనె తయారీతో పాటు దాని నుండి వివిధ రకాల ఉత్పత్తులను కూడా తయారు చేసే అవకాశం ఉందని తెలిపారు.

శివ శివ శంకర హరహర శంకర

- శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- పట్టిసీమలో ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

పోలవరం రూరల్: శివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. ముఖ్యంగా జిల్లాలోని పట్టిసం క్షేత్రానికి వేలాదిగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయని ఉత్సవ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య అన్నారు. పోలవరం మండలం పట్టిసం శైవ క్షేత్రం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్‌లు, దర్శనానికి వెళ్లే మార్గాలను, ఇసుక తిన్నెలపై నిర్మించిన చలువ పందిళ్లు ఇతర వస్తువులను పరిశీలించారు. లోటు పాట్లు ఉంటే వెంటనే సరిచేసుకుని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇసుక తిన్నెలపై భక్తులు నడిచి వెళ్లేందుకు వీలుగా గోనె సంచులతో మార్గాన్ని ఏర్పాటు చేశారు. నది దాటేందుకు వీలుగా నిర్మించిన పంట్లను కూడా ఆయన పరిశీలించారు. మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలవరం డీఎస్పీ ఎస్.సురేష్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టిసం రేవులో సీఐ కె.మధుబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీసులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. దేవస్థానం వద్ద ఈఓ ఎస్.సంగమేశ్వరశర్మ, ఇసుక తిన్నెలపై సెక్రటరీ టి.విజయలక్ష్మిలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



గోదావరి నదిలో కాలినడకన వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పంట్లు మార్గం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ అద్దయ్య



ఇసుక తిన్నెలపై చిరు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు సామగ్రిని తరలిస్తున్న వ్యాపారస్తులు

ప్రకృతి ప్రసాదించిన వరం పట్టిసం శైవక్షేత్రం



పోలవరం రూరల్: అఖండ గోదావరి నది మధ్య ఉన్న పట్టిసం శైవక్షేత్రాన్ని ప్రకృతి ప్రసాదించిన వరంగా భక్తులు కొలుస్తారు. ఎత్తయిన కొండ, చుట్టూ గుబురు పొదల మధ్య సహజ సిద్ధంగా వెలిసిన ఈ క్షేత్రం దైవదర్శనంతో పాటు, భక్తులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. స్వయం భూ క్షేత్రంగా హరిహరుల ఆధిక్యతను చాటి చెప్పే పవిత్ర లింగోద్భవ సమయాన్న భక్తులు ఉపవాసంతో శివరాత్రి జాగరణ చేస్తారు. పుణ్యక్షేత్రాలు, కాశీ, కేదారం, శ్రీశైలం, శ్రీకాళహస్తి, పట్టిసాచల క్షేత్రాలు పంచ మహాక్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. పట్టిసాచలాన్ని దేవకూటాద్రి, నీలాద్రి వంటి పేర్లతో పిలుస్తారు. పరమ శివుడు వీరేశ్వరస్వామిగా భద్రకాళీ సమేతుడై స్వయం భూగా వెలిశాడు. భూ నీలా సమేత భావన నారాయణ స్వామి క్షేత్రపాలకుడు కావడం ఈ శైవక్షేత్రంలో మరో విశిష్టత. శివకేశవుల ఆరాధన ఈ క్షేత్ర ప్రత్యేకత, కనకదుర్గ, మహిషాసుర మర్దని అమ్మవార్లు గ్రామ దేవతలు, వీరభద్రస్వామి పట్టసం అనే ఆయుధంతో దక్షప్రజాపతి శిరస్సు ఖండించి దేవకూటాద్రి పర్వతంపై ప్రళయతాండవం చేశాడని, శాంతించమని దేవతలు వేడుకోగా, లింగాకారంలో స్వయంభూగా ఇక్కడ వెలిశారని స్కంధ పురాణం చెబుతోంది.

గజేంద్ర మోక్షం ఇక్కడే

ఈ దేవకూట పర్వతానికి సమీపంలో గజేంద్రుడికి మహావిష్ణువు మోక్షం ప్రసాదించిన ప్రదేశం ఉంది. ఇదే ప్రదేశంలో శ్రీ మహావిష్ణువు కరి, మకరులకు మోక్షం ప్రసాదించారని ప్రతీతి. జాంబవంతుని కోరిక మేరకు దేవ కూట పర్వతంపై భావన నారాయణ స్వామి క్షేత్ర పాలకుడై వెలిశాడు. ఈ మహాశివరాత్రి పర్వదినాన్న ఇసుక తిన్నెలపై జరిగే ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని, అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.

ఉత్తమ ప్రదర్శనగా రాత నాటిక

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన 15వ జాతీయస్థాయి నాటికల పోటీల్లో వెలగలేరు థియేటర్ ఆర్ట్స్, వెలగలేరు వారి రాత నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. పాలకొల్లు పట్టణంలోని అద్దేపల్లి గంగరాజు సత్రం ప్రాంగణంలో మూడు రోజులు పాటు నిర్వహించిన పాలకొల్లు కళాపరిషత్ 15వ జాతీయ స్థాయి నాటికల పోటీల్లో చివరి రోజు మంగళవారం రాత్రి విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా బహుమతులు గెలుచుకున్న మరికొన్ని నాటికల్లో ద్వితీయ ఉత్తమ ప్రదర్శన అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి ఇంద్రప్రస్థం, తృతీయ ఉత్తమ ప్రదర్శన చైతన్య కళాభారతి కరీంనగర్ వారి స్వర్ణం రాల్చిన అమృతం నాటికలు గెలుచుకున్నాయి. జ్యూరీ ప్రదర్శన అరవింద్ ఆర్ట్స్ తాడేపల్లి వారి మనస్విని, ఉత్తమ రచన ఎనిమి, ఉత్తమ దర్శకత్వం రవీంద్ర రెడ్డి ఇంద్రప్రస్థం, ఉత్తమ నటుడు రాత నాటికలో గోవర్ధన్ పాత్రదారి పోలిదాసు శ్రీనివాస్, ఉత్తమ నటి రాత నాటికలో స్వప్నిక పాత్రదారి సురభి వాగ్దేవి, ఉత్తమ ప్రతినాయకుడు రాత నాటిక పవన్ కల్యాణ్, ఉత్తమ హాస్య నటుడు ఎనిమి నాటికలో సురేష్, ద్వితీయ ఉత్తమ నటుడు విముక్తి నాటికలో సాంబశివరావు, ఉత్తమ ద్వితీయ నటి మూల్యం నాటికలో జ్యోతిరాజు, ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ఇంద్రప్రస్థం, రవీంద్ర రెడ్డి, ఉత్తమ క్యారెక్టర్ నటి విముక్తి నాటికలో నాగమణి, ఉత్తమ రంగాలంకరణ ఎనిమి, సంగీతం స్వర్ణం రాల్చిన అమృతం సురభి నాగరాజు, ఉత్తమ మేకప్ రాత, జ్యూరీ బహుమతి ఎనిమి నాటికలో టి.నీతిక బహుమతులను గెలుచుకున్నారు. విజేతలకు రోటరీక్లబ్ అధ్యక్షుడు పెనుమాక రామ్మోహన్‌రావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ సభ్యులు కేవీ కృష్ణవర్మ, మానాపురం సత్యనారాయణ, వంగా నరసింహరావు, విశాకుల రమణ, కె గుప్త తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న రామ్మోహనరావు, కళాపరిషత్ సభ్యులు

విష్ణు కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్స్ పరిశీలన

భీమవరం: రానున్న సాధారణ ఎన్నికలు నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్స్ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు, బుధవారం భీమవరం సీతా పాలిటెక్నిక్ కాలేజీలో పాలకొల్లు, ఆచంట నియోజక వర్గాలకు సంబంధించి విష్ణు స్కూల్లో తణుకు, నరసాపురం నియోజకవర్గాలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఈవీఎంలు భద్రపర్చడానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో భీమవరం ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా తదితరులు పాల్గొన్నారు.



విష్ణు కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్స్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

దివ్యాంగురాలిపై అత్యాచారం

చాట్రాయి: దివ్యాంగురాలైన యువతిపై ఇద్దరు మైనర్ బాలురు అత్యాచారం చేసిన సంఘటన చాట్రాయిలో చోటు చేసుకుంది. ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చాట్రాయి గ్రామానికి చెందిన ఓ మానసిక వికలాంగురాలు (21)పై అదే గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్లు మంగళవారం ఇంట్లోకి చొరబడి అత్యాచారం చేశారు. అదే సమయంలో వికలాంగురాలు తల్లి ఇంట్లోకి రావడంతో మైనర్లు పారిపోయారు. దీంతో బాధితురాలి తల్లి బుధవారం పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై స్వామి తెలిపారు.

నరసాపురంలో ఇస్లాంకు శతాబ్దాల చరిత్ర

నరసాపురం: నరసాపురంలో ఇస్లాం మతానికి శతాబ్దాల చరిత్ర ఉందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలో ఇటీవల పునర్నిర్మించిన పాతబజార్‌లో ఉన్న మసీద్ (చినమసీదు) ప్రారంభ కార్యక్రమంలో ముదునూరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసాపురంలో పేరున్న మసీదులు 9 ఉన్నాయన్నారు. ఇక్కడ ముస్లింలు అందరితో సోదర భావంతో వ్యవహరిస్తారన్నారు. చిన మసీదును ఆధునికీకరించి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ పట్టణంలో 100 ఏళ్ల నాటి మసీదులున్నాయన్నారు. అంజుమన్‌సంఘ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ బులి మస్తాన్ మాట్లాడుతూ స్థానికంగా ముస్లింలు సేవా కార్యక్రమాలు కూడా పెత్త ఎత్తున నిర్వహిస్తారని చెప్పారు. మసీదు పునఃప్రారంభం నేపథ్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు బండారు మాధవ నాయుడు, కొత్తపల్లి జానకీరామ్, వైఎస్సార్ సీపీ నేతలు పీడీ రాజు, చాగంటి సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న తదితరులు పాల్గొన్నారు.



మసీదు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

మాయమాటలు చెప్పి బంగారం అపహరిస్తున్న వ్యక్తి అరెస్టు

తణుకు: బైక్‌పై తిరుగుతూ రోడ్డుపై మెడలో బంగారంతో తారసపడిన వ్యక్తులకు మాయమాటలు చెబుతూ వారి మెడలోని బంగారాన్ని తస్కరిస్తున్న యువకుడిని బుధవారం తణుకు పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం వేల్పూరు గ్రామానికి చెందిన అందే కోట గణరోహిత్ అనే బాలుడిని ఈ నెల 1న ఓ వ్యక్తి మోటారు సైకిల్ ఎక్కించుకుని మాయమాటలు చెప్పి మెడలోని బంగారు గొలుసును తీసుకుని ఉడాయించాడు. దీనిపై బాలుడి తండ్రి కోట వీరభద్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితుడు చెప్పిన గుర్తులతో సీసీ పుటేజీ ఆధారంగా ఏలూరు శనివారపుపేటకు చెందిన కాళిదాసు విజయకృష్ణ అలియాస్ విజయ్ దొంగతనం చేసినట్లు గుర్తించారు. అయితే బుధవారం పైడిపర్రు జంక్షన్ వద్ద నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద బంగారు గొలుసుతో పాటు నల్లజర్ల పోలీసు స్టేషన్ పరిధిలో ఇదే తరహాలో జరిగిన ఘటనలో అపహరించిన 12 గ్రాముల బంగారు గొలుసు, నాలుగు గ్రాముల ఉంగరం, విజయవాడ సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ పరిధిలో మరో కేసులో చోరీ చేసిన మోటారుసైకిల్, పెనుమంట్ర పోలీసు స్టేషన్ పరిధిలో దొంగిలించిన 12 గ్రాముల బంగారు గొలుసు మొత్తం 40 గ్రాముల బంగారు ఆభరణాలు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఈ కేసులో సహకరించిన ఎస్సై చంద్రశేఖర్‌తోపాటు హెడ్ కానిస్టేబుళ్లు కేవీ సుబ్బారావు, బండారు శ్రీనివాస్, కానిస్టేబుళ్లు వి.మాధరావు, మలకా శ్రీను, అన్వర్‌లను సీఐ జీవీవీ నాగేశ్వరరావు అభినందించారు.


● గడపగడపనా సంక్షేమం



పాలకోడేరు: సంక్షేమ పథకాలను వివరిస్తూ సాగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం ఉండి నియోజకవర్గంలో 200వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో బంటుమిల్లిలో లబ్ధిదారునికి నవరత్నాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

పాముకాటుతో వార్డు సభ్యురాలి మృతి

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పేరంపేట పంచాయతీ 1వ వార్డు సభ్యురాలు, వైఎస్సార్‌సీపీ నాయకురాలు రాజనాల అంకాలమ్మ (50) బుధవారం పాము కాటుతో మృతి చెందారు. తన మొక్కజొన్న చేలో కండెలు విరిచే పనిలో నిమగ్నమై ఉండగా అంకాలమ్మ పాము కాటుకి గురైంది. ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంకాలమ్మకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అంకాలమ్మ కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కఠారి సీతారాంబాబు, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు పరామర్శించారు.



అంకాలమ్మ

స్త్రీల రక్షణ చట్టాలను వినియోగించుకోవాలి

ఏలూరు (టూటౌన్): స్త్రీల అభివృద్ధి, రక్షణ కోసం ఉన్న చట్టాలను సరైన క్రమంలో ఉపయోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ కోరారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో పెదవేగి మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు స్త్రీ సాధికారత అనే అంశంపైన బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని కోరారు. అలాగే మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

భక్తులకు ఇబ్బంది లేకుండా విస్తృత ఏర్పాట్లు



వీరంపాలెం శివాలయంలో శివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ మూర్తి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం బాలాత్రిపుర సుందరీ ఆధ్యాత్మిక పీఠంలో ఈ నెల 7వ తేది నుంచి జరగనున్న మహాశివరాత్రి ఉత్సవఏర్పాట్లను బుధవారం డీఎస్పీ మూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా క్యూ లైన్లు, సౌకర్యాలు వంటి వాటి గురించి పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళవెంకటరమణ శాస్త్రికి వివరించారు. అనంతరం డీఎస్పీ మూర్తి మాట్లాడుతూ స్పటిక లింగ దర్శనానికి విచ్చేసే భక్తులందరూ పోలీస్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తిచేశారు. ఆయన వెంట రూరల్ సీఐ రమేష్, ఎస్ఐ, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ



ఆరుగొలను నెం.2 పాఠశాల విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని ఆరుగొలను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెం.2 విద్యార్థులకు బుధవారం భోజనం ప్లేట్లను పంపిణీ చేశారు. మండల విద్యాశాఖాధికారి వి.హనుమ సతీమణి పద్మశ్రీ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బి. భాస్కరరావు మాట్లాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్.శ్రీనివాస్, నవాబుపాలెం ప్రధానోపాధ్యాయుడు పుష్పరాజ్, పీసీ కమిటి చైర్మన్ ప్రసన్న, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఘనంగా సంతాన గోపాలస్వామి కల్యాణం



అత్తిలిలో సంతాన గోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: తణుకు రోడ్డులో వేంచేసియున్న సంతాన గోపాలస్వామి కల్యాణం బుధవారం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు, వల్లీ వెంకటేష్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో దాస సాహిత్య ప్రాజెక్టువారిచే కోలాట నృత్య ప్రదర్శన జరిగింది. మహిళా భక్తులు లలితా విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త లింగంపల్లి పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత తెలుగు సాహితీ సదస్సుకు గోపాల్ ఎంపిక

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు సుంకర గోపాల్ అఖిలభారత తెలుగు సాహితీ సదస్సుకు ఎంపికయ్యారు. ఆ వివరాలను కవి, రచయిత అయిన గోపాల్ విలేకర్లకు వివరించారు. మార్చి 9,10 తేదీల్లో కాకినాడ దంటు కళాక్షేత్రంలో జరిగే అఖిల భారత తెలుగు సాహితీ సమావేశాలకు ఉపన్యాసకులుగా గోపాల్ ఎంపిక య్యారు. గోపాల్ ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు బాబు, వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, రసాయనశాస్త్ర అధ్యాపకులు గోపాల్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

గూడెంలో భద్రతా దళాల కవాతు



కవాతు చేస్తున్న కేంద్ర రక్షణ బలగాలు

తాడేపల్లిగూడెం అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని వర్గాలవారు సహకరించాలని డీఎస్పీ మూర్తి కోరారు. పట్టణంలో హౌసింగ్ బోర్డు సెంటర్ నుంచి జయలక్ష్మి థియేటర్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మూర్తి మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, పలు రంగాలకు చెందిన వ్యక్తులు పోలీసులకు సహకరించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకారాన్ని అందించాలని కోరారు. పట్టణ సీఐ సీహెచ్ సుబ్రహ్మణ్యం, ఎస్సై జెవిన్ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ.. అపర సంజీవని

- 3,257 వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత చికిత్స
- రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పరిమితి పెంపు
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తణుకు టౌన్: గతంలో ఏదైనా రోగమొస్తే నయం చేసుకోవడానికి ఆస్తులు అమ్ముకోవాల్సి వచ్చేది. నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి లక్షలాది మందికి పునర్జన్మని ప్రసాదించారు. ఆయన కుమారుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి అదే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని పేదల పాలిట అపర సంజీవినిగా మార్చారు. వైద్యం కోసం ఏ కుటుంబ రోడ్డున పడకుండా, ఏ వ్యాధికైనా వారికయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరించేలా ఆరోగ్యశ్రీ పథకంలో ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.5లక్షలుగా ఉన్న పరిమితిని రూ.25లక్షలకు పెంచారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంపై లబ్ధిదారులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆపద్బాంధవి ఆరోగ్యశ్రీ

ఆరోగ్యశ్రీ పథకంలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్ సర్జరీ, పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్, పాలిట్రామా, క్యాన్సర్ తదితర విభాగాలకు సంబంధించి 3,257 రకాల రోగాలకు చికిత్సలు అందజేస్తున్నారు. గర్భిణులు సుఖ ప్రసవాలు చేసుకునేందుకు ఆరోగ్యశ్రీలో చికిత్స అందిస్తున్నారు. వీరికి చికిత్స ముందు, తర్వాత కూడా 108 వాహనాన్ని వినియోగించుకునే వీలు కల్పించారు. ప్రభుత్వ ఆస్పత్రి లేదా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే వెసులుబాటు రోగికి కల్పించారు. ఏడాదికి రూ.5లక్షలలోపు ఆదాయమున్న కుటుంబాల్లోని సభ్యులకు ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స చేసి, తిరిగి క్షేమంగా ఇంటికి పంపించే వరకూ బాధ్యత తీసుకుంటున్నారు. ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకునే సయంలో రోగులు కోలుకునేందుకు రోజుకు రూ.225 చొప్పున నెలకు గరిష్టంగా రూ.5000 వరకూ ఆసరాగా అందజేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై ఏఎన్ఎం, ఆశ, వలంటీర్లు మొబైల్ యాప్ ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్యశ్రీ కార్డులను ఇంటింటా పంపిణీ చేస్తున్నారు. తాజాగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకునేందుకు ఏడాదికి రూ.5లక్షలుగా ఉన్న పరిమితిని రూ.25లక్షలకు పెంచడంతో నిరుపేదలకు కొండంత ధైర్యం కలుగుతుంది. ఆపద ఎదురైనప్పుడు ఆరోగ్యశ్రీ ఆపద్బాంధవిగా ఉపయోగపడుతుందన్నారు.

ఆరోగ్య శ్రీ పునర్జన్మనిచ్చింది



నేను ఆరోగ్యశ్రీ పథకంలో బ్రెయిన్ స్ట్రోక్ ఆపరేషన్ చేయించుకున్నాను. ప్రస్తుతం నేను చాలా ఆరోగ్యంగా ఉన్నాను. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నాకు పునర్జన్మ లభించింది. అంతేకాకుండా ఆసరా ద్వారా నా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంది. వైఎస్సార్ కుటుంబానికి ఎప్పటికీ రుణపడిఉంటాం.

– ఇసుకపాటి విశ్వేశ్వరరావు, వేల్పూరు

పరిమితి పెరిగింది



ఆరోగ్య శ్రీ ద్వారా ప్రభుత్వ, నెట్ వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందేందుకు గతంలో ఉన్న రూ. 5 లక్షల ఆదాయ పరిమితిని రూ. 25లక్షల వరకూ ప్రభుత్వం పెంచింది. గతంలో కంటే ఇప్పుడు ఎక్కువ వైద్య సేవలు అందజేస్తున్నారు.

– బోడపాటి వీర్రాజు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, తణుకు

నగదు రహిత వైద్య సేవలు



రాష్ట్రంలో వైఎస్సార్ ఆరోగ్య పథకం ద్వారా అర్హతకలిగిన వ్యక్తుల కుటుంబాలకు నగదురహితంగా వైద్యసేవలు అందిస్తున్నారు. రాష్ట్రంలోఉన్న ఏ ఆస్పత్రిలోనైనా రోగులకు ఉచితంగా వైద్యం అందించడం ఈ పథకంయొక్క లక్ష్యం. నగదు రహిత ఆరోగ్య సంరక్షణా ప్రయోజనాలను అందించే ఈ పథకం అనేక రకాల చికిత్సలను అందజేస్తుంది.

– డాక్టర్ కేఆర్ఎం కిషోర్, వైద్యాధికారి , వేల్పూరు పీహెచ్‌సీ

తణుకు నియోజకవర్గంలో 2019 నుంచి 2023 వరకూ ఆరోగ్య శ్రీ పథకంలో చికిత్సలు

తణుకు నియోజకవర్గంలో అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల్లో మొత్తం నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక సామాజిక ఆరోగ్య కేంద్రం ఉన్నాయి, ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఆరోగ్య శ్రీ పథకంలో చికిత్సలు వివరాలు

సంవత్సరం	ప్రాథమిక ఆరోగ్య కేంద్రం	చికిత్సలు
2019	వేల్పూరు	112
	రేలంగి	64
	ఇరగవరం	865
	అత్తిలి	89
	మంచిలి	13
2020	వేల్పూరు	1299
	రేలంగి	198
	ఇరగవరం	944
	అత్తిలి	298
	మంచిలి	89
2021	వేల్పూరు	1136
	రేలంగి	176
	ఇరగవరం	1617
	అత్తిలి	415
	మంచిలి	85
2022	వేల్పూరు	1296
	రేలంగి	346
	అత్తిలి	506
	మంచిలి	242
	ఇరగవరం	2348
2023	వేల్పూరు	513
	రేలంగి	268
	అత్తిలి	128
	ఇరగవరం	2426
	మంచిలి	582
	మొత్తం	16, 256

పదో తరగతిలో ప్రతి విద్యార్థి ర్యాంకులు సాధించాలి



తాడేపల్లిగూడెం భవిత కేంద్రంలో దివ్యాంగులకు పరీక్షా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదోతరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి ర్యాంకులు సాధించాలని తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. బుధవారం స్థానిక సుబ్బారావు పేట భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ పదో తరగతిలో టౌన్ టాపర్‌కు డైమండ్స్ లయన్స్ క్లబ్ పదమ్ కుమార్‌గుప్తా సహకారంతో రూ.10,116లు విద్యాప్రోత్సాహం అందజేయనున్నట్టు తెలిపారు. అలాగే, మోడ్రన్ ప్రగతి కాలేజీ వారి ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, కుందుం వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయ స్వామి, కొప్పెళ్ళ సాయి సత్యనారాయణరాజు, జామి సత్యనారాయణ, ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య, అంగన్‌వాడీ టీచర్ సత్యవతి, రత్నకుమారి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం సబ్ స్టేషన్‌లో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, సబ్ స్టేషన్ విస్తరణ నిమిత్తం గురువారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.కావున సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేద ప్రజల గుండెల్లో జగనన్న

రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేపట్టిన ప్రజాదీవెన పాదయాత్రలో పాల్గొన్న అశేష జనం

తణుకు టౌన్: పార్టీలకతీతంగా ప్రజలందరికీ పథకాలందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం తణుకు రూరల్ మండలం తేతలి, దువ్వ గ్రామాల్లో నిర్వహించిన ప్రజా దీవెన పాదయాత్ర, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన తేతలి గ్రామంలో గడప గడపకు తిరిగి ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమ కోరుతూ పథకాలను అమలు చేస్తున్నారని, కానీ గతంలో టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా కేవలం టీడీపీ నాయకులే దోచుకుని పంచుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ప్రజలందరికీ అర్హతే ప్రామాణికంగా అందజేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో తేతలి గ్రామంలో కేవలం రూ. 5 కోట్ల 82 లక్షల మాత్రమే అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం ఒక్క తేతలి గ్రామంలోనే రూ. 66 కోట్ల 75 లక్షల విలువైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేశామని చెప్పారు. గతంలో ప్రజలకు చెందాల్సిన అనేక సంక్షేమ పథకాల సొమ్ములు టీడీపీ నాయకులు దోచేసుకున్నారని విమర్శించారు. గతంలో దోచుకున్నది చాలక ఇప్పుడు మళ్లీ ఓట్లు అడుగుతూ ఏ మొహం పెట్టుకుని గ్రామాల్లో తిరుగుతున్నావని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన అభ్యర్థి రాధాకృష్ణను ప్రశ్నించారు. గతంలో టీడీపీ హయంలో ఉన్న బడ్జెట్‌తోనే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందజేశారని, ఇవన్నీ అప్పుడు ఎందుకు ఇవ్వలేదో టీడీపీ నాయకులను ప్రశ్నించాలని కోరారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల సమయం రావడంతో రెండు కండువాలతో వచ్చిన మరలా ఓట్లేయించుకుని మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అటువంటి వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిద్ధం సభలను చూసి పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న చందంగా బీసీ గర్జనలు పెట్టారని, అయితే ఆసభకు మూడు జిల్లాల నుంచి కేవలం 20 వేల మంది మాత్రమే వచ్చారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, కోట స్వామీజీ, మండల ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, అత్తిలి మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గారపాటి పద్మజ, సొసైటీ అధ్యక్షుడు పి సతీష్ రాజు, వీరవల్లీ పూర్ణ, జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ జిలానీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు పీ సురేష్, నాయకులు భూపతిరాజు రామకృష్ణంరాజు, దారం శ్రీను, పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మక్కా సూర్యనారాయణ

అత్తిలి: గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ చెప్పారు. బుధవారం అత్తిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కోట్లాదిరూపాయల నిధులు వెచ్చిస్తోందని, గ్రామాల్లో నెలకొన్న చిన్నిచిన్న సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు మార్చడంలో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని లక్ష్మీనారాయణపురం, ఈడూరు, వరిఘేడు ఎంపీటీసీ సభ్యులు ఆడారి శ్రీనివాసరావు, సుంకర నాగేశ్వరరావు, అనిశెట్టి త్రిమూర్తులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వరిఘేడులో విద్యుత్ వైర్లు సరిచేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి కోరారు. మంచిలి నుంచి కంచుమర్రు వెళ్లే రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని కంచుమర్రు సర్పంచ్ కృష్ణంరాజు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఎన్నికల నేపథ్యంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూశాఖ అధికారులు జాప్యం లేకుండా జారీ చేయాలని ఉరదాళ్లపాలెం, గుమ్మంపాడు సర్పంచ్‌లు శింగంశెట్టి శ్రీనివాస్, వేగేశ్న ధనసత్యనారాయణరాజు కోరారు. జగనన్న ఇండ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి లబ్ధిదారుడు అందుబాటులో లేకపోయినప్పటికీ అర్హుని పేరు రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్మీనారాయణపురం ఎంపీటీసీ సభ్యుడు ఆడారి శ్రీనివాసరావు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. లక్ష్మీనారాయణపురం గ్రామానికి సక్రమంగా రక్షితనీరు అందేలా చూడాలని సర్పంచ్ పాలమరశెట్టి నాగేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైస్ ఎంపీపీలు సుంకర నాగేశ్వరరావు, దారం శిరీషా, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పురుషులతో సమానంగా మహిళలు



నవాబుపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో లింగ సమానత్వం, సమాజంలో మహిళల పాత్ర, వేధింపులు, మహిళలకు సమాన హక్కులు వంటి వాటిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ, బాల్య వివాహాలు నేరమన్నారు. అనంతరం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఆశాలత, ఆరోగ్య కార్యకర్త విజయనిర్మల, ఆశాలు దేవి, రమణ, దేవి, అంగన్‌వాడీ టీచర్ తులసీ, కోమలి తదితరులు పాల్గొన్నారు.



ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో మహిళలను సత్కరించిన దృశ్యం

మహిళలకు అన్ని రంగాల్లో రాణించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళలకు గౌరవం లభించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలు ఉన్నాయని ఆదర్శ సోషల్‌సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం స్థానిక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబుజ్జి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళల పేరున అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రొక్కాల ఆశీర్వాదం, కోశాధికారి సుగుణ రత్నకుమారి, కమిటి సభ్యులు మరియమ్మ, మేరీ రత్నకుమారి, జ్వాలా గ్రేస్, హేమశ్రీ, రోజా, సువార్త మణి, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళా కేంద్రంలో బుధవారం రాత్రి సద్గుర త్యాగరాజస్వామి 83వ ఆరాధనోత్సవాలు త్యాగరాజ గాన సభ ఆధ్వర్యంలో జరిగాయి. గౌరవ అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, అధ్యక్షుడు గరికపాటి బాపయ్య శర్మలు పర్యవేక్షించారు. గుంటూరు వాస్తవ్యురాలు లంకా అనురాధ, కొలచన లక్ష్మీ ఆత్మారాం గాత్రాలకు వైలన్‌పై భాగవతుల సీతాపతిరావు, మృదంగంపై కె.అనిల్ కుమార్‌లు సహకరించారు. భక్త మార్కండేయ పుస్తకావిష్కరణ, గౌరవ సత్కారాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

చార్టెర్డ్ అకౌంటెంట్స్ జిల్లా చైర్మన్‌గా విశ్వనాథ్



చార్టెర్డ్ అకౌంటెంట్స్ జిల్లా చైర్మన్‌గా ఎంపికైన డి.విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న సీఏలు

తాడేపల్లిగూడెం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చార్టెర్డ్ అకౌంటెంట్స్ అసోసియేషన్ బ్రాంచ్ చైర్మన్‌గా సీఏ ధూళిపాళ విశ్వనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో బుధవారం జరిగిన ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా, సౌత్ ఇండియా రీజినల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా శాఖ సమావేశం జరిగింది. సమావేశంలో చైర్మన్‌గా డి.విశ్వనాథ్, వైస్‌చైర్మన్‌గా కె.కాత్యాయిని, సెక్రటరీగా ఎం.రామకృష్ణ, కోశాధికారిగా ఎం.శ్రీకాంత్ హనుమాన్‌గుప్త తో పాటు సికాస చైర్మన్‌గా జి.వి జయకుమార్‌లు ఎంపికయ్యారు. సభ్యులుగా వి.రవికుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు సీఏ చదివేందుకు ముందుకు రావాలన్నారు. ఏలూరులో ఉన్న జిల్లా ప్రధాన కార్యాలయం ద్వారా ఇనిస్టిట్యూట్ విధివిధానాలను సక్రమంగా నిర్వహిస్తూ సీఏలకు సహకారం అందిస్తామన్నారు. నూతన సభ్యులతో ఢిల్లీకి చెందిన సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డి.ప్రసన్నకుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పూర్వ సంఘ చైర్మన్లు జి.విజయకుమార్, ఎస్.వి.రమణరావు, సుంకవల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



తణుకు టౌన్ : మండపాకలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

తణుకు టౌన్: మండలంలోని మండపాక గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష రెండో విడత వైద్య శిబిరంలో మొత్తం 378 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బంగారు రవి తెలిపారు. మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 378 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో నలుగురికి ఈసీజీ, ఆరుగురికి మలేరియా పరీక్షలు, నలుగురికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈవోపీఆర్‌డీ ఏఎస్ కోటేశ్వరరావు, వైద్యులు డాక్టర్ సాయి గిరిరెడ్డి, డాక్టర్ మహాలక్ష్మి, ఆరోగ్య సహాయకులు, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ఇరగవరం : అర్జునుడుపాలెంలో ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు

ఇరగవరం: మండలంలోని అర్జునుడుపాలెం ఎంపీయూపీ పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 340మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. సర్పంచ్ పోతుల గంగాధరరావు, ఎంపీడీవో కె పద్మజ్యోతి, వైద్యులు నిమ్మల సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ మౌనిక, డాక్టర్ కీర్తి పాల్గొన్నారు.

పేదల వైద్యానికి అండగా ప్రభుత్వం



తణుకులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పేదల వైద్య అవసరాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం మంత్రి కారుమూరి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వైద్యసేవలు రూ.25 లక్షలకు పరిమితి పెంచడమే కాకుండా అనారోగ్యం కారణంగా అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో చేయించుకున్న వైద్య ఖర్చులకు సైతం ప్రభుత్వం భరోసా ఇస్తోందని అన్నారు. పేదల వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తూ ఖర్చుకు వెనకాడడం లేదని స్పష్టం చేశారు. తణుకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన బాధిత కుటుంబసభ్యులకు వివిధ వైద్య ఖర్చుల నిమిత్తం 7 చెక్కుల రూపంలో రూ.18.72 లక్షలను ప్రభుత్వం మంజూరు చేయగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఇరగవరం మండల అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, మాజీ కౌన్సిలర్ తానేటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు పట్టణంలోను, పెంటపాడులోను బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగాయి. ఆరు కళాశాలలు వాసవి, జీఎంఆర్, ఆదిత్య, ప్రగతి, గోయెంకా ఉమన్స్, పెంటపాడు జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం లెక్కలు పేపరు -1ఎ, బోటనీ పేపర్ -1, సివిక్స్ పేపర్ -1 పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయిని ఆయా కళాశాలల ప్రతినిధులు తెలిపారు.